చల్లనితల్లి

గన్నంరాజు సుందరరావు

తల వంచుకొని భారంగా నడుస్తూ తన కన్సల్టింగ్ రూంలోకి వచ్చాడు డాక్టర్ శ్రీరాం.

'డాక్టర్' అంటూ తను కూర్చున్న కుర్చీలోంచి తడబడుతూ లేచి నిలబడింది రాగిణి ఆమె ముఖం దైన్యంగా వుంది. అపరిమితంగా ఏడిచినందువల్ల ఆమె కళ్లు ఎర్రబారి వున్నాయి. దాదాపు రెండు గంటల నుంచీ ఆమె కన్సల్టింగ్ రూంలో కూర్చుని డాక్టర్ శ్రీరాం కోసం ఆదుర్దాగా ఎదురుచూస్తోంది.

డాక్టర్ శ్రీరాం రా గి ణి వైపు ఒకసారి జాలిగా చూసి ఉస్సురంటూ నీరసంగా తన రివాల్వింగ్ చెయిర్‌లో కూలబడిపోయాడు. స్టెతస్కోపూ, కళ్లజోడూ తీసేసి టేబిల్‌మీద పడేశాడు. కుర్చీలో వెనక్కి జారగిలబడి, గాఢంగా నిట్టూర్చాడు. కళ్లు మూసుకొని కుడి చేతి వేళ్లతో నుదుటిమీద గట్టిగా రాసుకుంటూ దీర్ఘాలోచనలో పడిపోయాడు. అతనికి సుమారు అరవైసంవత్సరాల వయస్సుంటుంది. అజానుబాహువు. ఆరోగ్యంగా దృఢంగా వుండే అతని దేహాన్ని వయోభారం ఒక్కసారిగా క్రుంగదీసేసినట్టుగా వడిలిపోయాడు. చిరునవ్వులు చిందిస్తూ ఎల్లవేళలా

ప్రసన్నంగా ఉండే అతని వదనం వాడి పోయి విషాదం కమ్ముకొని వుంది.

డాక్టర్ శ్రీరాం ముఖంలోని భావాలను పరిశీలిస్తున్న రాగిణిలో ధైర్యం సడలి పోసాగింది. క్షణాలు దొర్లిపోతున్న కొద్దీ ఆమెలో ఆరాటం పెచ్చుమీరిపోతోంది భయాందోళనలు ఆమె హృదయంలో విలయతాండవం చేస్తున్నాయి. డాక్టర్ శ్రీరాం నోటినుండి ఎలాంటి దుర్వార్త వినవలసి వస్తుందో, ఆ తరువాత పరిస్థితులు ఎంత భయంకరంగా మారుతాయో అని కలవరపడుతూంది. 'ఎటువంటి అనర్థం జరక్కుండా రక్షించు భగవాన్' అంటూ వాపోతోంది.

రాగిణి వెంట వచ్చిన నౌఖరు రాజయ్య కూడా డాక్టర్ శ్రీరాం ఏం చెబుతాడో వినాలని కుతూహలపడుతూ తదేకంగా అతన్ని చూస్తూ చేతులు కట్టుకొని గోడవారగా శిలావిగ్రహంలా నిలబడిపోయాడు.

కొద్దిసేపటికి డాక్టర్ శ్రీరాం నిద్ర నుంచి మేల్కొన్నవాడిలా నెమ్మదిగా కళ్లు విప్పి, గంభీరంగా రాగిణినీ, రాజయ్యనూ చూసి దీర్ఘంగా నిట్టూర్చాడు. కూర్చోమన్నట్టుగా రాగిణికి చేత్తో సంజ్ఞ చేశాడు. వేళ్లతో నుదుటిమీద పడే జుట్టును ఎగదోసుకుంటూ అసలు విషయాన్ని రాగిణికి ఎలా చెప్పాలో నిర్ణయించుకోలేక మథన పడుతూ, ఆమె వైపు దిగులుగా చూస్తూ వుండిపోయాడు

"డాక్టర్ ఏం జరిగిందో త్వరగా చెప్పండి ప్లీజ్" గద్గదికంగా అంది రాగిణి, కలవరపాటును అణచుకోలేక.

"ఏం చెప్పమంటావు తల్లీ-జీవితంలో ఏనాడూ నేను ఇటువంటి క్లిష్టపరిస్థితిని ఎదుర్కోలేదు. నా శక్తి వంచన లేకుండా చెయ్యగలిగినదంతా చేశాను. అతనికి బ్లడ్ విపరీతంగా పోయింది. ప్రస్తుతం అతనికోసం 'ఎ' గ్రూప్ బ్లడ్ కావాలి. 'ఒ' గ్రూపయినా పరవాలేదు. అదీ అతనికి సరిగ్గా సూట్ అవాలి. అతనికి సూటయే బ్లడ్ ప్రస్తుతం మన హాస్పిటల్లో లేదు. దగ్గరలో వున్న బ్లడ్ బాంకిలో కూడా దొరకలేదు. బ్లడ్ దొరికితేగాని మనం ప్రొసీడ్ కాలేం. చాలా అర్జంటుగా కావాలి. ఆలస్యం అవుతున్నకొద్దీ అతనికి ప్రమాదం దగ్గరపడే అవకాశం వుంది. ఆ తర్వాత మనం శతవిధాల ప్రయత్నించినా ఫలితం ఉండకపోవచ్చు. అందుకే నీకు ఏమీ చెప్పలేక ఇంతసేపూ నాలో నేనే మథనపడ్డాను." నీరసించిన స్వరంతో అన్నాడు డాక్టర్ శ్రీరాం.

ప్రతిభావంతుడైన డాక్టర్ శ్రీరాం నోటినుండి నిరాశాపూరితమైన మాటలు వెలువడగానే హతాశురాలయింది రాగిణి. గుండెలో బాణం దిగబడినట్టుగా గిలగిల గింజుకుపోయింది. ఆమెకు దుఃఖం వెల్లువలా పొంగుకొచ్చింది.

"మరొక మార్గమేదీ లేదా డాక్టర్ ?"

అతి కష్టంమీద దుఃఖాన్ని అరికట్టు కుంటూ అంది రాగిణి.

"అయాం సారీ, మరొక మార్గం వుంటే నేనెందుకిలా కుమిలిపోతాను? బ్లడ్ కోసం ఇక్కడ కూడా చాలా మందిని టెస్ట్ చేశాను. కాని ఫలితం శూన్యం. అతనికి సూటయిన బ్లడ్ దొరకడంలేదు. కొందరి బ్లడ్ సూటయినా అందులో ఇన్ఫెక్షన్సు ఉన్నాయి. అది ఎంతమాత్రం పనికిరాదు. ఈ రోజు ఎంత దుర్దినమోగాని ఎంతమందిని టెస్ట్ చేసినా కావలసిన బ్లడ్ దొరకడం లేదు. అందుకోసం నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. అదృష్టం వుంటే తప్పకుండా దొరుకుతుంది. నువ్వు కాస్త ధైర్యంగా వుండాలి. భగవంతుడు కనికరిస్తే మన ప్రయత్నం తప్పకుండా ఫలిస్తుంది." రాగిణిని అనునయిస్తూ అన్నాడు డాక్టర్ శ్రీరాం.

"డాక్టర్! మీ ప్రయత్నం ఫలించాలి. తప్పకుండా ఫలిస్తుంది. ఆ నమ్మకం, ధైర్యం, నాకున్నాయి. నాకు తెలిసినంత వరకూ, ఇలాంటి క్లిష్టమైన కేసులలో ఎన్నోసార్లు మీరు ఘనవిజయాన్ని సాధించారు. ఈ కేసులో కూడా మీకు జయం కలగాలి. మా అన్నయ్య బ్రతికి బయటపడాలి. అన్నయ్యకి ఏమైనా అయితే వదినను సముదాయించుకోవడం అసాధ్యం. ఆమె హార్ట్ ట్రబుల్ గురించి మీకు క్షుణ్ణంగా తెలుసు. అన్నయ్యకి ప్రమాదం జరిగిందని వదిన కింకా తెలియదు. ఆమెకు తెలిస్తే ఇక మనకు దక్కదు. అన్నా, వదినా, ఎంతో ఆదరంగా నన్ను సాకుతూ నాకు తల్లీ, తండ్రీ లేని లోటును భర్తీ చేస్తున్నారు. వాళ్ళిద్దరూ లేకపోతే వారి పిల్లలూ, నేనూ, దిక్కులేని పక్షులమైపోతాం" అంటూ దోసిట్లో ముఖం పెట్టుకొని బావురుమంది రాగిణి.

డాక్టర్ శ్రీరాం చలించిపోయాడు. అతని హృదయం ద్రవించింది. చెమ్మగిల్లిన కళ్ళను రుమాలుతో అద్దుకున్నాడు.

"అమ్మా రాగిణీ! నాకన్నీ తెలుసు. డాక్టర్ రాంగోపాల్ నీకు అన్నయ్య మాత్రమే కాదు అతను నాకు కుడి భుజం లాంటివాడు. ఈ హాస్పిటల్‌కి వెన్నెముకలాంటివాడని అంటే అది అతిశయోక్తి కాదేమో. అతను నా అసిస్టెంటుగా ఈ హాస్పిటల్‌లో చేరాక నాకు చాలావరకు రిలీఫ్ దొరికిందనే చెప్పాలి. పేషంట్లను శ్రద్ధాసక్తులతో, ఆదరాభిమానాలతో చూసుకుంటూ అనతికాలంలోనే చాల ఉదారబుద్ధి కలవాడనీ, తెలివైన డాక్టరనీ, అశేష ప్రఖ్యాతి నార్జించాడు. నా హాస్పిటల్ ఈనాడు ఇంత అభివృద్ధిలోకి వచ్చిందంటే, దానికి కారకుడు రాంగోపాల్ అని చెప్పితీరాలి. కార్లలో వచ్చేవారినీ, కాలినడకన వచ్చేవారినీ, సమభావంతో ఆదరించిగౌరవించే విశాలహృదయుడు. గొప్పా, బీదా,

అనే తారతమ్యం లేకుండా రోగులను కన్నబిడ్డలవలె ఆదుకుని ట్రీట్‌మెంటు చేస్తూ పేదల హృదయాలలో దైవంగా నిలిచాడు.

కఠోరమైన దరిద్రంతో, నరక ప్రాయమైన జీవితాన్ని గడుపుతూ, గుక్కెడు మందునీళ్లయినా దొరక్క ప్రాణాలు పోగొట్టుకొన్న నా తల్లి చివరి కోరికను తీర్చడానికి ఎన్నో కష్ట నిష్ఠురాలనూ, భయంకర పరిస్థితులనూ, చిక్కు సమస్యలనూ ఎదుర్కొంటూ, కష్టపడి చదివి డాక్టరు నయాను. ఆ చల్లని తల్లి కోరిక ప్రకారం రోగాలతో బాధ పడుతూ, తగిన మందులు కొనడానికి ఆర్థికంగా శక్తి లేక అగచాట్లు పడే నిరుపేదలను ఆదుకోవడమే ప్రధానోద్దేశంగా పెట్టుకొని ఈ హాస్పిటల్‌ను స్థాపించాను. కూటికి గతిలేని నిరుపేదలతో బాటు, కోటికి పడగలెత్తిన కుబేరులు కూడా ఈ హాస్పిటల్‌కు విరివిగా రావడం వలన అఖండైశ్వర్యాన్నీ, కీర్తినీ ఆర్జించాను. డాక్టర్ రాంగోపాల్ తన శక్తిసామర్థ్యాలను బీద ప్రజలను రోగాల బారినుండి రక్షించడానికేవినియోగిస్తూ, నా లక్ష్యాన్నీ ఆశయాన్నీ అక్షరాలా అమలుజరుపుతూ నాకు మితిలేని ఆనందాన్నీ, అటుపైన నా తల్లి ఆత్మకు శాంతినీ కలుగ జేస్తున్నాడు. అతను లేకపోతే ఈ హాస్పిటల్ స్తంభించిపోతుందంటే అది అబద్ధం కానేరదు. అనేకమంది రోగార్తులు నిస్పృహ చెందిపోతారు అందుకని అతను బ్రతికి తీరాలి. అతన్ని బ్రతికించుకోవడానికి సర్వవిధాలా ప్రయత్నిస్తున్నాను. ఈ వార్ధక్య దశలో నాకు చేదోడు వాదోడుగా ఉంటూ, ఈ హాస్పిటల్ కీర్తి ప్రతిష్ఠలను ఇంకా ఇనుమడింపచేస్తాడని పొంగిపోయాను. ఇప్పుడు క్రుంగిపోతున్నాను. అతన్ని రక్షించమని హృదయపూర్వకంగా దైవాన్ని ప్రార్థిస్తున్నాను" ఆవేదనగా అన్నాడు డాక్టర్ శ్రీరాం.

అతని ఆవేదనాపూరితమైన మాటలు రాగిణి దుఃఖాన్ని రెట్టింపుచేశాయి. కళ్లు మూసుకొని టేబిల్‌మీద వాలిపోయి మౌనంగా రోదించసాగింది.

రాగిణి దుఃఖాన్ని చూడలేక డాక్టర్ శ్రీరాం నీరసంగా కుర్చీలోంచి లేచి డాక్టర్ రాంగోపాల్ బెడ్ దగ్గరకు వెళ్ళిపోయాడు.

అంతవరకూ స్థాణువులా నిలబడిపోయిన రాజయ్య ఇక అక్కడ ఉండ లేక కన్సల్టింగ్ రూం బయటకు వచ్చి, దూరంగా ఉన్న హాస్పిటల్ గార్డెన్‌లోకి పోయి, ఒక చెట్టు కింద ఉన్న సిమ్మెంటు బెంచీమీద చతికిలబడ్డాడు.

మోటారు సైకిల్ ఆక్సిడెంట్‌లో బలమైన గాయాలు తగిలి డాక్టర్ రాంగోపాల్ ప్రాణాపాయస్థితిలో పడినందుకు రాజయ్య హృదయం ఆనందంతో పరవళ్లు తొక్కుతోంది. తన కష్ట తీరే

సమయం ఆసన్నమైందనీ, దీర్ఘకాల నిరీక్షణ సఫలీకృతమౌతోందనీ, పొంగి పోతున్నాడు అంతలోనే ఏదో ఆలోచిస్తూ పళ్లు పట పట కొరికాడు. అతని పిడికిళ్లు బిగుసుకుపోయాయి. కోపంతో ముఖం జేవురించింది, కళ్లు ఎర్రబారాయి.

అప్పుడు ఉదయం పదిగంటలు దాటింది. రోహిణి కార్తె ఎండ మండి పోతోంది. మండే ఎండకన్న మిన్నగా రాజయ్య గుండె మండుతోంది. తీక్షణంగా ఉన్న ఎండా, గుండెల్లోని మంటా, అతన్ని తీవ్రంగా గాబరా పెట్టేస్తున్నాయి. చెమటకు తడిసిన చొక్కా విప్పేసి విసుగ్గా పక్కన గిరాటేశాడు. కండలు తిరిగి బలిష్టంగా ఉన్న అతని శరీరం చెమటపట్టి నిగనిగ మెరుస్తూ, అతని సంపూర్ణారోగ్యాన్ని ప్రస్ఫుటితం చేస్తోంది.

గతాన్ని గుర్చి తలపోస్తూ పంట్లాం జేబులోంచి బీడీకట్టా, అగ్గి పెట్టే తీసి, బీడీ వెలిగించాడు. అగ్గిపుల్లను కసిగా నేలకేసి కొట్టాడు. గుండె నిండుగా దమ్ములాగి విసురుగా పొగ బయటకు వదిలాడు. 'దొంగముండాకొడుకు రక్తం దొరక్కపోతే చస్తాడుట, చావనీ పీడ విరగడై పోతుంది.' పళ్లు నూరుకుంటూ అనుకున్నాడు రాజయ్య.

రాజయ్య డాక్టర్ రాంగోపాల్ దగ్గర గత పదిహేను సంవత్సరాలనుంచీ నౌఖరుగా పనిచేస్తున్నాడు. రాంగోపాల్ తనకు చేసిన ద్రోహాన్నీ, అన్యాయాలనూ తల్చుకుంటూ ఆవేశంతో వూగిపోతున్నాడు.

'ఇంతవరకూ ఒక్క క్షణం కూడా తనని నిశ్చింతగా బ్రతకనివ్వలేదు, వెధవ. తన బ్రతుకును నాశనం చేశాడు. తన ఇంటి దీపాన్ని ఆర్పేసి తనకు జీవితమంతా మనశ్శాంతి లేకుండా చేశాడు. వీడు డాక్టరుగా ఎంతోమంది ప్రాణాలను కాపాడి వుండవచ్చు. అది తనకు అనవసరం. తన మొదటి భార్య అలివేలు ఎంత అందంగా, ఆరోగ్యంగా వుండేదని! గంగిగోవులాంటి అలివేలుని నిర్లక్ష్యం చేసి హతమార్చేశాడు. అలివేలుకి అది మొదటి కాన్పు కావడం వలన నరకయాతన పడింది. కడుపులో చచ్చిపోయిన కవలపిల్లలను వీడు ఆపరేషన్ చేసి బయటకు తీసి అలివేలు ప్రాణాన్ని నిలబెట్టాడని తను ఎంతో పొంగిపోయాడు. కాని ఆపరేషన్ అయిన గంటలోగానే శక్తిని కోల్పోయిన అలివేలు పరిస్థితి విషమించిపోయింది. అలివేలు పడుతున్న బాధను చూడలేక తను వెళ్ళి మొర పెట్టుకుంటే వీడు పరుగు పరుగున వచ్చి అలివేలును పరీక్షించి పరిస్థితి చెయ్యి దాటిపోయిందని ఆక్రోశించాడు. అంతవరకూ తనకు తెలియజెయ్యకుండా ఉపేక్షించినందుకు అలివేలు దగ్గర డ్యూటీ చేస్తున్న నర్సును చెడా మడా తిట్టిపోశాడు.

వెంటనే అలివేలుకి చివరి ప్రయత్నంగా ఇంజక్షను చేశాడు. అంతలోనే ఎవరో వచ్చి మరెవరికో సీరియస్‌గా వుందని చెబితే అలివేలు రూంలోంచి అటు పరుగెత్తాడు. అలివేలుకి ఇచ్చిన ఇంజక్షను సత్ఫలితాన్నివ్వలేదు. ఆమె పరిస్థితి పూర్తిగా దిగజారిపోయి గిలగిల తన్ను కుంటూ ప్రాణం వదిలేసింది. ప్రాణం పోయే ముందు అలివేలు తనను దగ్గరగా పిలిచి 'కక్ష తీర్చుకున్నాడు నేను లొంగ లేదని నా మీద కక్ష తీర్చుకున్నాడు, అంటూ తనని నిస్సహాయంగా చూస్తూ కన్ను మూసింది. అలివేలు కలువ రేకుల్లాంటి కళ్ళు శాశ్వతంగా మూసుకు పోయిన క్షణంలో, తన రెండు కళ్ళూ పోయినట్టుగా, లోకమంతాచీకటిగా మారి పోయింది. వీడి అసలు రంగు అలివేలు ద్వారా బయటపడినప్పుడు తన కళ్ళు భగభగ మండాయి. తన హృదయంలో పగ పడగ విప్పి బుసకొట్టింది. కాటు వెయ్యడానికి తగిన సమయం కోసం, అవకాశం కోసం, ఆ నాటినుంచీ ఎదురు చూస్తున్నాడు. పది సంవత్సరాలు దొర్లి పోయినా, తనకా అవకాశం లభ్యం కాలేదు. దైవికంగా ఈ నాడు తను ప్రతీకారం తీర్చుకొనే అవకాశం దొరికింది.

తను సీతని రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టారు. పిల్లలను తనూ, సీతా, ఎంత గారాబంగా చూసుకుంటున్నా, వీడి పిల్లలు తన పిల్లలిద్దరిచేతా అడ్డమైన పనులూ చేయించుకుంటున్నారు. చెయ్యకపోతే తంతున్నారు. పిల్లలకు బాగా చదువు చెప్పించి వృద్ధిలోకి తేవాలని తనెంతగానో అభిలషించాడు. కాని గొడ్డుచాకిరీకి అలవాటు పడిపోయిన పిల్లలకు చదువు అబ్బలేదు. వాళ్ల బ్రతుకులు నాశనమౌతున్నాయి.

తన తండ్రి వీళ్ల కొంపలో పూడిగం చేస్తూ హతమారిపోయాడు ఆ రోజు తన తండ్రే కారును నడిపి వుంటే ఆ ప్రమాదం జరిగి వుండేది కాదేమో. అతన్ని పక్కకు నెట్టి, వీడి బాబు, కారును నడిపి లారీకి గుద్దించేశాడు. ఇద్దరూ చచ్చారు. ఆ బెంగతోనే తన తల్లి కన్ను మూసింది. అప్పటికి తనకి పదిహేనేళ్లు-పదవతరగతి చదువు తున్నాడు. దిక్కులేని తనపై సానుభూతిని చూపిస్తూ, చదువును మానిపించి వీడి కొంపలో పూడిగానికి పెట్టుకున్నాడు. ఆనాటినుంచీ అడ్డమైన చాకిరి చేయించు కుంటున్నాడు. తన తండ్రి జీవితం వీళ్ళకి సేవ చేస్తూండగానే అంతమై పోయింది. ప్రస్తుతం తనూ, సీతా, పిల్లలూ గొడ్డుచాకిరీ చేస్తూ, అడుగులకు మడుగు లొత్తుతూ, బానిస బ్రతుకులు బ్రతకాల్సి వస్తోంది. ఇప్పుడే కాకుండా భవిష్యత్తులో కూడా తన పిల్లలు వీడి పిల్లల క్రింద చాకిరీ చేస్తూ బ్రతకాల్సి ఉందేమో. దీన్నిబట్టి చూస్తే ఈ వ్యవ

హారం ఇలాగే తరతరాల వరకూ కొనసాగేటట్టుగా కనిపిస్తోంది. ఇంక ఈ అన్యాయం ఇలా అన్యాయంగా కొనసాగడానికి వీల్లేదు. తన బ్రతుకూ, సీత బ్రతుకూ ఎలాగూ కాలిపోతున్నాయి. తన పిల్లల భవిష్యత్తు వీళ్ల కాళ్లకింద పడి నాశనం కాకూడదు. అది తను భరించలేడు. తన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే, వీడు తనకి చేసిన ద్రోహానికి తగిన శాస్త్రి జరగాలంటే, తక్షణం వీడు చావాలి, చచ్చి తీరాలి. దృఢంగా అనుకుంటూ కుడిచేతి పిడికిలితో సిమ్మెంటు బెంచీమీద గట్టిగా గుద్దాడు, రాజయ్య.

డాక్టర్ రాంగోపాల్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిసి జనం గుంపులు గుంపులుగా వచ్చి తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. అందరి ముఖాల్లోనూ దైన్యం తాండవిస్తోంది. రోజూ మాదిరిగా అతని దగ్గర ట్రీట్‌మెంటు కోసం వచ్చిన రోగులు ఆర్తనాదాలు చేస్తున్నారు. హాస్పిటల్ లోపలా, బయటా, అంతా కోలాహలంగా వుంది. మెయిన్ ఎంట్రెన్సు దగ్గర జనం గుమిగూడి వున్నారు. అదంతా గమనిస్తూ మరొక బీడీని వెలిగించి గట్టిగా దమ్ములాగి నిదానంగా పొగ వదిలాడు రాజయ్య.

'ఎంతమంది జనం వస్తున్నారు! వాళ్లందరికీ వీడు దేముడు! కాని వీడి నిజస్వరూపం ఈ అమాయకపు జనాలకి తెలియదు. ఆ సంగతి తను చెప్పినా వాళ్లు నమ్మరు. తల బాదుకొని గోల పెట్టినా వినరు. పైగా తనని ముక్కలు ముక్కలుగా కోసి పారేస్తారు. తమ దైవాన్ని తూలనాడితే సహిస్తారా వాళ్లు? హుఁ దైవం' అనుకుంటూ కోపంతో బుస కొట్టాడు రాజయ్య. ఆరిపోయిన బీడీని విసుక్కుంటూ విరిచి పారేశాడు.

'ఇప్పుడు వీడి ఆయువుపట్టు తన చేతిలో వుంది. తను రక్తదానం చేస్తే బ్రతికిపోతాడు. తన రక్తం వీడికి సరిపడుతుందట! ఇదివరకు తను ఎవరికో రక్తదానం చేసినప్పుడు చెప్పాడు. అదృష్టంకొద్దీ ఆ సంగతి మరెవరికీ తెలియదు. భక్తి విశ్వాసాలతో పనిచేసుకుంటున్న తనకి తీరని ద్రోహం చేశాడు. ద్రోహానికి ద్రోహమే తగినశాస్తి. తను కనీసం ఒక్క చుక్కయినా రక్తాన్ని ఇవ్వకూడదు. అలాగే వుండి వుండి మరెక్కడా రక్తం దొరక్కపోతే చస్తాడు. ఆ కబురు తెలిసి వాడి భార్య కరుణాదేవి గుండె పగిలి చస్తుంది. అసలు అలివేలు చావుకి మూలకారణం వీడి భార్య. గుండె జబ్బు కారణంగా దాన్ని దూరంగా వుంచాల్సి వచ్చి, వీడు అలివేలు వెంటబడి వుంటాడు. కామాంధుడు. అలివేలు లొంగలేదని కక్ష పెట్టుకొని హతమార్చేశాడు రాక్షసుడు. చేసిన పాపం వూరకే

పోతుందా-ఈ దెబ్బతో ఇద్దరూ కూలి పోతారు. తరువాత-తనూ, సీతా పిల్లలూ స్వేచ్ఛగా, హాయిగా జీవించవచ్చు. అసలు అలివేలు పోయినప్పటినుంచీ పీడి కొంపలో వూడిగం మానేద్దామని తను శతవిధాల ప్రయత్నించాడు. కాని ఎక్కడా మంచి నౌఖరీ దొరకలేదు. వీడూ, కరుణాదేవీ, చచ్చిన తరువాత తనకా అదృష్టం పట్టవచ్చు." మీసాన్ని మెలివేసుకుంటూ ఆనందంతో పొంగి పోయాడు రాజయ్య. కాని...

రాజయ్యలో ఆ ఆనందం ఎంతోసేపు నిలువలేకపోయింది. దేవతలాంటి కరుణాదేవి రూపం అంతరంగంలో మెదలగానే, అతనికి ఎవరో గుండెం మీద బలంగా తన్నినట్టయింది. అమాయకురాలూ, కరుణామయీ, అయిన కరుణాదేవి అంతాన్ని అన్యాయంగా కోరి నందుకు అతని మనసు నడుం విరిగిన పాములా గిలగిల కొట్టుకుపోయింది. క్రమక్రమంగా అతని ఆనందం హరించి పోతున్న కర్పూర హారతిలా దిగజారి పోతూ, ఆ స్థానంలో పశ్చాత్తాపం చోటు చేసుకో నారంభించింది. అమితమైన పశ్చాత్తాపం అతని కన్నులలో నీరు నింపింది.

"కరుణాదేవిలాంటి చల్లని తల్లి మరణాన్ని అన్యాయంగా కోరిన తను పరమ కిరాతకుడు. మహా పాపాత్ముడు. ఆ తల్లి మహాత్మురాలు. ఇంత చదువు కున్నా, ఎన్ని సంపదలున్నా, ఆమెది విశాలహృదయం. పేరుకు తగ్గట్టు కరుణరస పూరితమైన ప్రవర్తన ఆమెది! ఆ మహనీయురాలు కలకాలం సుఖంగా జీవించాలి. ఆమెకు ఎటువంటి అనర్థం జరగకూడదు. అది తన మూలంగా అసలు జరగకూడదు. ఆ మహాసాధ్వికి ఎంత ద్రోహాన్ని తల పెట్టాడు తను! తనింకా బ్రతికున్నా డెందుకు? తన తల పగిలి ముక్కలు కాకుండా వుందేం? శత్రువునైనా కనికరించి చేరదీసే దయార్ద్ర హృదయు రాలు! సాటి మానవులకు ఆమె చేసే సహాయం ఎనలేనిది. తన సీతకు జబ్బు చేసినప్పుడు ఆ తల్లి దానికి ఎంత ఉదారంగా సేవలు చేసిందని! అప్పుడు తనెంత పొంగిపోయాడు. 'మీ దయ వలనా, అపారమైన సేవ వలనా, సీత బతికి బయటపడింది. మీరు ఆదుకోక పోతే సీత నాకు దక్కకుండా పోయేది. మీరు మా పట్ల చూపిస్తున్న దయకు ప్రతిఫలంగా ఏమివ్వగలం? భగవంతుడు మీకు మేలుచేస్తాడు తల్లీ" సీతకు, అని ఆతల్లి పథ్యం పెట్టినప్పుడు, చెమ్మగిల్లిన కళ్లను ఒత్తుకుంటూ అన్నాడు తను.

'ఇదొక సేవ కాదు దయచూపించడం అంతకన్నా కాదు. నా విద్యుక్త ధర్మాన్ని నేను నిర్వర్తించుకున్నాను. అంతే కాని మరేమీ కాదు. ఆపదలోవున్నవారిని చేతనయినంతవరకూ ఆదుకోవడానికి



ప్రయత్నించాలి. మనకి అటువంటి అవకాశం వచ్చినప్పుడు దాన్ని జార విడుచుకోకూడదు. సాటివారిని కష్ట సమయంలో ఆదుకోవడంలో అమితమైన ఆనందం వుంది. జీవితకాలం బహు స్వల్పం. అందులో సాధ్యమైనంతవరకూ కలుషితం లేకుండా చూసుకోవాలి. తెలియక మనం ఎన్నో పాపాలు చేస్తూనే వున్నాం. తెలిసీ పాపాలు చేసేదానికి బదులు పుణ్యకార్యాలు చేయగలిగే అవకాశం వచ్చినప్పుడు, దాన్ని సద్వినియోగం చేసుకోవాలి దైవస్వరూపమైన ప్రేమను సర్వ జీవరాసుల మీదా చూపే అవకాశం ప్రతి వ్యక్తికీ వుంది. సాధ్యమైనంతవరకూ దాన్ని ఆచరణలో పెట్టాలి. దౌర్జన్యం, మోసం, ద్రోహం, హింస–ఇలాంటివన్నీ ఘోరపాపాలు. వీలున్నంత వరకూ వాటిని దూరంగా వుంచాలి. వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి, కత్తిని కత్తితోనే ఎదుర్కోవాలి, మోసానికి

మోసమే సరయిన జవాబు. ద్రోహానికి ద్రోహం చెయ్యడమే తగిన శాస్తి—అనే సిద్ధాంతం అన్ని సందర్భాలలోనూ ఆచరించదగినది కాదు. ఎంతటి ద్రోహి అయినా ప్రాణాపాయస్థితిలో ఉండి మన సహాయాన్ని అర్థించినప్పుడు గాని, లేక మన సహాయం వలన అతని ప్రాణం నిలబడే అవకాశం ఉన్నప్పుడు గాని, అతను మనకు చేసిన ద్రోహాన్ని మనసులో పెట్టుకొని, నిర్లక్ష్యంచేసి అతని ప్రాణం పోవడానికి దోహదం చేసేకన్నా ఆపదలో వున్న ఆ వ్యక్తిని కాపాడడంలోనే వుంది ఔన్నత్యం. అందువల్ల మనం పొందే మానసికానందం అద్వితీయమైనది.' తననూ, సీతనూ, ఆప్యాయంగా చూస్తూ ఎంత చల్లని మాటలు చెప్పింది ఆ తల్లి! అదొక అపూర్వ సందేశం! ఆమె బంగారు పలుకులు మరువరానివి! ఆచరించ దగినవి...అయితే ఆ చల్లని తల్లి మాటలకు తనేం విలువనిచ్చాడు? ఆమె తమపట్ల చూపే ఆదరణకు ఆమె మరణాన్ని కోరుకోవడమా తనిచ్చే ప్రతి ఫలం? తనను భగవంతుడు క్షమిస్తాడా? ...ఎన్నటికీ క్షమించడు. కరుణాదేవికి కీడు తలపెట్టడం క్షమించరాని నేరం. ఏమయినా సరే, తను కుటుంబంతో సహా సర్వనాశనం అయినా సరే, తర తరాల వరకూ, వీళ్ల సేవకు తన వంశం అంకితమై అథఃపాతాళానికి అణగారి పోయినా ఫరవాలేదు. కరుణాదేవి అమూల్య వాక్కులను ఆచరణలో పెట్టాలి. అదృష్టంకొద్దీ తన కిప్పుడా అవకాశం దొరికింది. ద్రోహపూరితమైన తన నిర్ణయాన్ని మార్చుకోవాలి. రాంగోపాల్‌కి తన రక్తాన్ని ధారపొయ్యాలి అవసరమైతే ఒక్క చుక్క రక్తమైనా తన దేహంలో ఉంచుకోకుండా అర్పించాలి. అతన్ని బ్రతికించాలి. ఆ చల్లనితల్లి పసుపు కుంకాలను నిలబెట్టాలి. అయితే...తన కక్ష తీరేదెలా?...కసి చల్లారేదెలా?...ఎలాగ?...కరుణాదేవి కోసం తను కక్ష తీర్చుకొనే అవకాశాన్ని జారవిడుచుకోవాలా?......రాజయ్య మనసు చిందరవందర అయిపోసాగింది. మోకాళ్ల మధ్య తలను పెట్టుకొని మధన పడసాగాడు. అలివేలు చివరి మాటలు అతని చెవుల్లో గంటల్లా మ్రోగుతున్నాయి. వేయిరూపాల్లో గోచరమౌతూ, కక్ష తీర్చుకోమని అలివేలు గొంతు చించుకొని అరుస్తోంది...ఎలాగ?...తనిప్పుడేం చెయ్యాలి?...ఎటువైపు మొగ్గాలి?..., పట్టరాని వ్యథతో క్రింది పెదవిని పళ్లతో నొక్కిపెట్టి పిడికిళ్లు బిగించి సిమెంటు బెంచీకేసి కొట్టుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు. 'భగవాన్ ఏమిటీ విషమ పరీక్ష' అనుకుంటూ ఆకాశంవైపు నిశ్చ లంగా చూశాడు. కరుణాదేవి దేవతలా నిలబడి కర్తవ్యాన్ని బోధిస్తున్న టుగా కనిపిస్తోంది. మరొకవైపు కక్ష

తీర్చుకోమని అలివేలు గగ్గోలు పెడుతోంది. రాజయ్య మనస్సు సుస్థిరతను కోల్పోయి ఎటూ తెగని ఆలోచనల మధ్య ఊగిసలాడిపోసాగింది. అంతరంగం యుద్ధరంగంగా మారి మంచికీ-చెడుకీ, మానవత్వానికీ-దానవత్వానికీ మధ్య ఘోర సమరం సాగుతూంచే భరించలేక నుదుటిమీద గట్టిగా చేత్తో గుద్దుకుంటూ విలవిల లాడిపోయాడు రాజయ్య. చివరకు మంచిని ఎదురించి పోరలేక చెడు వెలవెలపోయింది. మానవత్వం ముందు రాక్షసత్వం నిలువలేక చిత్తు చిత్తుగా ఓడిపోయి పారిపోయింది. హాలాహల జ్వాలలు అణగారిపోయి అమృతం ఉద్భవించింది.

రాజయ్య మనసు నిర్మలంగా ప్రశాంతంగా మారింది. దృఢనిశ్చయం ఏర్పడి వజ్రంకన్నా గట్టిపడిపోయింది. 'రాంగోపాల్ ప్రఖ్యాతిగాంచిన డాక్టరు. చుట్టుపక్కల మూడు నాలుగు జిల్లాల మేరకు అతన్ని మించినవాడు లేడు. అతని అపారమైన సేవలో వేలాది రోగార్తులు రోగాలు నయం చేసుకుంటున్నారు. ఎంతోమంది మృత్యుముఖంనుంచి బయటపడుతున్నారు. అలివేలు కాలం తీరి చచ్చిపోయి ఉండొచ్చు. డాక్టర్లు రోగులందరినీ బ్రతికించి తీరాలనుకోడం వెర్రితనం. మానవ సహజమైన మానసిక దౌర్బల్యం వలన అలివేలుని కాంక్షించి వుంటాడు. తను లొంగకపోయినందువల్ల కక్ష

తీర్చుకున్నాడని అలివేలు అపోహపడి ఉండొచ్చు. అలివేలు పోయాక ఈ పది సంవత్సరాలూ తను రాంగోపాల్ మీద అనవసరంగా కక్ష పెట్టుకున్నాడు. ఈనాటికి భగవంతుడు, తన కళ్లు తెరిపించి మహోపకారం చేశాడు తను రక్తాన్నివ్వక పోతే, ఒక్క రాంగోపాల్ మాత్రమే నష్టపోడు. అతని మరణవార్త విని దేవతలాంటి కరుణాదేవి కూలిపోతుంది. డాక్టర్ శ్రీరాంగారు పిచ్చెత్తిపోయే అవకాశం వుంది. తలమానికంలాంటి హాస్పిటల్ ఔన్నత్యం నేలపాలవుతుంది. వేలాది ప్రజలు రోగాలతో తీవ్రమైన బాధలకు గురికావలసి వస్తుంది. అటువంటి దుర్భర పరిస్థితి ఏర్పడితే తను భరించలేడు. కరుణాదేవికీ, రాంగోపాల్‌కీ, శ్రీరాంగారికీ, వేలాది ప్రజలకూ, తీరని ద్రోహంచేసి తను నిశ్చింతగా బ్రతకడం అసంభవం. అప్పుడు బ్రతికున్నా చచ్చినా ఒకటే... అమ్మా కరుణాదేవీ నీ ఉపదేశం ఇంతటి ఘోరపాపాన్ని చెయ్యకుండా నన్ను కాపాడింది. నీ కోసం నా ప్రాణాన్నయినా ఇచ్చేస్తాను. నా గుండెను కోసుకొని రక్తాన్ని పిండి, రాంగోపాల్ బాబుకి ధారపోస్తాను.' కుడి చేతి పిడికిలి బిగించి ఆవేశంగా అనుకున్నాడు రాజయ్య. అతని కళ్లలో నీళ్లూరాయి. వెనువెంటనే డాక్టర్ శ్రీరాం దగ్గరకు పరుగుతీశాడు.

సుమారు రెండు గంటల తరువాత, డాక్టర్ శ్రీరాం ఆనందంతో పొంగిపోతూ రాజయ్యను గాఢంగా కౌగిలించుకున్నాడు. "రాజయ్యా సమయానికి దేవుడిలా వచ్చి నీ రక్తాన్ని ధారపోసి రాంగోపాల్‌ని బ్రతికించావు. అంతేకాకుండా, అతని సేవలో రోగాల బారినుండి విముక్తి చెందుతున్న వేలాది ప్రజలను రక్షించావు. ఆపదలో వున్నవారికి తమ ఆరోగ్యవంతమైన రక్తాన్ని నిస్వార్థంగా దానంచేసే నీలాంటి మహానుభావులూ, ఔదార్యవంతులూ, మానవాళికి ఎంతో అవసరం." అభిమానం హద్దులు మీరుతూండగా రాజయ్య వీపును ఆప్యాయంగా నిమురుతూ అన్నాడు డాక్టరు శ్రీరాం.

'నాలాంటి పాపాత్ములు కాదు. కరుణాదేవిలాంటి దేవతలు, చల్లని తల్లులు, మానవాళి మనుగడకు అవసరం' హృదయపూర్వకంగా అనుకున్నాడు రాజయ్య, డాక్టర్ శ్రీరాం చూపే అభిమానానికి ఉక్కిరి బిక్కిరవుతూ.

ఆనందాశ్రువులు జాలువారుతూండగా వాళ్ళిద్దరినీ కృతజ్ఞతతో చూస్తూ వుండిపోయింది రాగిణి.